సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 11 । అక్టోబర్ । 2023



స్థిరంగా చీనీ ధరలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయల ధరలు స్థిరంగా కొనసాగాయి. టన్ను గరిష్ట ధర రూ.20వేలు పలికాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.



జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

అక్రమమద్యంపై ఉక్కుపాదం

- జిల్లా వ్యాప్తంగా పోలీసుల దాడులు



స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసులు

పుట్టపర్తి టౌన్: అక్రమ మద్యంపై పోలీసు శాఖ ఉక్కుపాదం మోపింది. మంగళవారం జిల్లా వ్యాప్తంగా దాడులు చేసి భారీగా మద్యాన్ని సీజ్ చేసింది. ఈ మేరకు అడిషనల్ ఎస్పీ విష్ణు ఒక ప్రకటన విడుదల చేశారు. సీకేపల్లి, హిందూపురం, తనకల్లు, మడకశిర సెబ్ స్టేషన్ల పరిధితోపాటు తూముకుంట చెక్‌పోస్టుల పరిధిలో దాడులు నిర్వహించి 165 (90ఎంఎల్), 40 (180ఎంఎల్) పాకెట్ల మద్యంతో పాటు 22 లీటర్ల మద్యం సీజ్ చేశారు. అలాగే 60 లీటర్ల బెల్లం ఊటతోపాటు 2 వాహనాలు జప్తు చేసి ఐదుగురు ముద్దాయిలపై 6 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

రేపు కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ పరీక్ష

అనంతపురం అర్బన్: జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ ఉద్యోగ నియామకానికి సంబంధించి ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 12న కంప్యూటర్ ప్రొఫిషియన్సీ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఆర్ఓ గాయత్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన అభ్యర్థుల జాబితాను అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టరేట్లు, అన్ని రెవెన్యూ డివిజనల్ అధికారి, తహసీల్దారు కార్యాలయాల నోటీసు బోర్డులో ఉంచామన్నారు. కంప్యూటర్ ప్రొఫిషియన్సీ పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జేఎన్‌టీయూలోని సెంట్రల్ కంప్యూటర్ సెంటర్‌లో జరుగుతుందన్నారు.

‘కొత్త’ కానుక

జనవరి నుంచి రూ.3 వేల పింఛన్



- రూ.250 పెంచుతున్నట్లు ప్రకటించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- జనవరి నుంచి రూ.3 వేల పింఛన్
- ఆనందోత్సాహాల్లో వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులు
- జిల్లాలోని 2.40 లక్షల మందికి లబ్ధి

పుట్టపర్తి అర్బన్: వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు వైఎస్ జగన్ సర్కార్ నూతన సంవత్సర కానుక అందిస్తోంది. వైఎస్సార్ కానుక పేరుతో ప్రతి నెలా ఠంచనుగా రూ.2,750 పింఛన్ అందిస్తున్న ప్రభుత్వం జనవరి నుంచి మరో రూ.250 పెంచుతోంది. దీంతో జనవరి నెలలో వీరంతా రూ.3 వేల పింఛన్ అందుకోనున్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా పింఛన్ కానుక పెంచుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలోనే జనవరి నుంచి రూ.3 వేల పింఛన్ అందిస్తామని సోమవారం విజయవాడ వేదికగా జరిగిన పార్టీ ప్రతినిధుల భారీ బహిరంగ సభలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. దీంతో జిల్లాలోని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జగనన్న చెప్పాడంటే...చేస్తాడంతే అంటూ ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు.

జిల్లాలో లబ్ధిదారులు ఇలా..

వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారుల ఎంపిక కూడా పారదర్శకంగా జరుగుతోంది. దరఖాస్తు చేసుకున్న వెంటనే వివరాలన్నీ పరిశీలించి అర్హులకు పింఛన్ అందే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈక్రమంలోనే సెప్టెంబర్ నెలలో రెండు విడతల్లో జిల్లాలోని 14,191 మందికి నూతన పింఛన్లు మంజూరు అయ్యాయి. దీంతో ప్రస్తుతం జిల్లాలో 2,73,975 మందికి ప్రభుత్వం వైఎస్సార్ పింఛన్ కానుక అందిస్తోంది. ఇందుకోసం ప్రభుత్వం ప్రతి నెలా రూ.76,13,01,750 నగదు విడుదల చేస్తోంది. ఇక జనవరి నుంచి ప్రభుత్వం 2.40 లక్షల మందికి పింఛన్ మొత్తాన్ని రూ.250 పెంచి అందజేయనుండటంతో జిల్లాలోని లబ్ధిదారులకు రూ.6 కోట్లు అదనంగా అందనుంది. ప్రస్తుతం జిల్లాలో రూ.2,750 పింఛన్ మొత్తాన్ని అందుకుంటున్న లబ్ధిదారులు 2,40,156 మంది ఉన్నట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు.

ఆహా ఒకటో తారీఖు

గత ప్రభుత్వాల పాలనలో పింఛన్‌దారులంతా తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఏ రచ్చకట్టమీద పింఛన్ ఇస్తున్నారో.... జన్మ భూమి కమిటీ మెంబర్ ఇంటి వద్ద ఇస్తున్నారో తెలియక సతమతమయ్యేవారు. అసలు సెక్రటరీ ఏ గ్రామంలో ఉన్నాడో తెలుసుకోవాలంటేనే తల ప్రాణం తోకకు వచ్చేది. సెక్రటరీ వస్తారని తెలిసినా తెల్లవారుజామునే క్యూలో పింఛన్ పుస్తకం పెట్టి సాయంత్రం వరకూ అక్కడే కాచుకుంటే తప్ప పింఛన్ మొత్తం అందేది కాదు. అది కూడా కేవలం రూ. 1000 ఇచ్చేవారు. తీరా ఎన్నికలు సమీపించడంతో ఈ మొత్తాన్ని అప్పటి పాలకులు రూ.2 వేలకు పెంచి ఒక నెల ఇచ్చి ఎన్నికలకు వెళ్లారు. దీంతో వారి పన్నాగాన్ని పసిగట్టిన జనం టీడీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపారు. ఎందరో ఆకాంక్షలకు ప్రతిరూపంగా రాష్ట్రంలో కొలువుదీరిన జగన్ సర్కార్ పింఛన్ దారులకు భారీ ఊరట నిచ్చింది. ఒకటో తేదీ తెల్లవారుజామునే అదీ ఇంటి తలుపు తట్టి మరీ వలంటీర్ పింఛన్ మొత్తాన్ని అందజేస్తున్నారు. దీంతో ఎందరో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు ‘వైఎస్సార్ పింఛన్ కానుక’ ద్వారా ఎవరిపై ఆధారపడకుండా జీవనం సాగిస్తున్నారు. ఒకటో తేదీన ఉదయమే పింఛన్ మొత్తం అందగానే పింఛన్ లబ్ధిదారులంతా ఆహా ఒకటో తేదీ అంటూ ఆనంద పడుతున్నారు. ప్రస్తుతం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ప్రస్తుతం ప్రభుత్వం రూ.2,750 చొప్పున ఇస్తోంది. జనవరి నుంచి వీరందరికీ రూ.3 వేల పింఛన్ అందనుంది. ఇక మొదటి నుంచి దివ్యాంగులకు రూ.3 వేలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.5 వేలు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.10 వేల పింఛన్ అందిస్తోంది.



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

చెప్పాడంటే చేస్తాడంతే



సీఎం వైఎస్ జగన్ ఏదైనా చెప్పాడంటే తప్పకుండా చేస్తాడనే నమ్మకం అందరిలోనూ ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారు. చెప్పనవి కూడా ప్రజల కోసం చేశారు. పింఛన్ కూడా చెప్పిన విధంగానే పెంచుకుంటూ పోతున్నారు. జనవరి నుంచి రూ.3 వేల పింఛన్ ఇస్తానని ప్రకటించారు. అందువల్లే జనమంతా మళ్లీ ఆయనే సీఎం కావాలని కోరుకుంటున్నారు.

– వెంకటలక్ష్మి, అమడగూరు

2.40 లక్షల మందికి లబ్ధి



జిల్లాలో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళల పింఛన్లు సుమారు 2.40 లక్షలు ఉన్నాయి. వీరందరికీ ప్రస్తుతం రూ.2750 అందుతోంది. దీనికి రూ.250 పెంచి జనవరి నుంచి రూ.3 వేల పింఛన్ అందిస్తామని సీఎం తెలిపారు. ఈ మేరకు జిల్లా నుంచి జాబితాలు పంపాం.

– నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

ఈవీఎంల పరిశీలనకు రండి

- రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ ఆహ్వానం



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎంల) పరిశీలన(ఫస్ట్ లెవల్ చెక్)కు రాజకీయ పార్టీల ప్రతినిధులంతా రావాలని కలెక్టర్ అరుణ్ బాబు కోరారు. ఈనెల 16న ధర్మవరం మార్కెట్ యార్డులో ఈవీఎంల పరిశీలన జరుగుతుందన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఈవీఎంల పరిశీలనను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈవీఎంల పనితీరుకు సంబంధించి ఫస్ట్ లెవల్ చెక్(ఎఫ్ఎల్‌సీ) చాలా ముఖ్యమైందన్నారు. ఇందులో రాజకీయ పార్టీల భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. అందువల్ల ఆయా పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆహ్వానం పలికారు.

9,081 ఈవీఎంల స్కానింగ్ పూర్తి

జిల్లాకు అందిన 3,021 సీయూలు, 3,030 బీయూలు, 3,030 వీవీ ప్యాట్‌లు కలిపి మొత్తంగా 9,081 ఈవీఎంల స్కానింగ్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. అక్టోబర్ 13వ తేదీలోపు యాక్సెప్టెన్సీ పరీక్షలు నిర్వహించి ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. వచ్చే వారం ఈవీఎంల వివరాలను రాజకీయ పార్టీలకు అందజేస్తామన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాలను అనుసరించి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోల్ నిర్వహిస్తామన్నారు. జిల్లాలో నిర్వహించే ఎఫ్ఎల్‌సీ విధానాన్ని వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల కమిషన్ సైతం ప్రత్యక్షంగా పరిశీలిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రంగారెడ్డి, సీపీఐ నాయకులు వేమయ్య, సీపీఎం నాయకులు గౌస్, గంగాధర్, జనసేన నాయకులు అబ్దుల్, ఎన్నికల డీటీ మైనుద్దీన్ పాల్గొన్నారు.

‘సురక్ష’తో పేదలకు మెరుగైన వైద్యం

- కలెక్టర్ అరుణ్‌బాబు



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

కొత్తచెరువు: ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ కార్యక్రమం ద్వారా నిరుపేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన కొత్తచెరువు పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే శిబిరం వద్ద ఏర్పాటు చేసిన హెల్త్ డెస్క్, ఓపీ రిజిస్ట్రేషన్, వైద్యులకు కేటాయించిన ల్యాబ్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సహాయ కేంద్రం, మందుల కౌంటర్, కంటి పరీక్షా కేంద్రం, ఐసీడీఎస్ శాఖ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ శిబిరాల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదన్నారు. శిబిరాలకు వచ్చే వారందరికీ 7 రకాల పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. అవసరమైన వారికి సంబంధిత పరీక్షల పత్రాలను అందించాలని, ఈసీజీతో పాటు 14 రకాల పరీక్షలను నిర్వహించాలని, అవసరం మేరకు ఉచితంగా మందులు అందించాలన్నారు. అలాగే శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేయాలన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందించాలన్నారు. ఐసీడీఎస్ శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను గర్భిణులు, బాలింతలు సందర్శించి తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి తెలుసుకోవాలన్నారు. శిబిరంలో 350 మందికి చికిత్సలు చేయడంతో పాటు మందులు అందజేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి, తహసీల్దార్ రామాంజనేయ రెడ్డి, సర్పంచ్ రాధ, ఈఓఆర్‌డీ సిద్ధారెడ్డి, వైద్యులు అశ్వర్థకుమార్, లలిత భవాని, మమత, సూపర్‌వైజర్ పుష్ప, అంగన్‌వాడీ వర్కర్లు ఫర్హాన, ఉమాదేవి, రాధ, స్వాతి, సచివాలయ ఉద్యోగులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రేపు టీజీటీలకు కౌన్సెలింగ్

ప్రశాంతి నిలయం: జోన్–4 పరిధిలోని మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న టీజీటీలకు ఈ నెల 12 తేదీన కడపలో పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుది జాబితాను ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారుల కార్యాలయాల్లో ప్రదర్శించామన్నారు. జాబితాలో పేరు ఉన్న టీజీటీలు సర్వీసు రిజిస్టర్, ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడేళ్ల యాన్యువల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్టుతో కడప గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

ఏపీలో సచివాలయ వ్యవస్థ బాగుంది

- ‘కిలా’ కోఆర్డినేటర్ సోనియా



పంచాయతీ, సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న ‘కిలా’ సభ్యురాలు

చిలమత్తూరు/గోరంట్ల: ఆంధ్రప్రదేశ్‌లో సచివాలయ వ్యవస్థ, అందిస్తున్న సేవలు చాలా బాగున్నాయని ‘కిలా’ (కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్) సంస్థ కోఆర్డినేటర్ సోనియా అన్నారు. ఐఎస్ఓ గుర్తింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం చిలమత్తూరు, గోరంట్ల గ్రామ పంచాయతీలను ప్రతిపాదించగా, ‘కిలా’ సభ్యులు మంగళవారం రెండు గ్రామ పంచాయతీలను సందర్శించారు. ఈ సందర్భంగా ‘కిలా’ కోఆర్డినేటర్ సోనియా రెండు గ్రామ పంచాయతీల్లోనూ ఐఎస్ఓ గుర్తింపునకు కావాల్సిన అన్ని అంశాలను పరిశీలించారు. అనంతరం ఆమె ఆయా గ్రామ సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. సచివాలయాల్లో వారి బాధ్యతలు, అందించే సేవల గురించి ఆరా తీశారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డుల నిర్వహణను పరిశీలించి పలు సూచనలు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత మెరుగుపడినా.. పాత రికార్డులను భద్రపరచడంపై కూడా దృష్టి సారించారని, తద్వారా విలువైన సమాచారం పంచాయతీల్లోనే లభించే అవకాశం ఉంటుందన్నారు. తల్లులు పాలు ఇవ్వడానికి వీలుగా ‘ఫీడింగ్ రూం’ ఉంటే బాగుంటుందన్నారు. కేరళలో ప్రతి పంచాయతీకి ఐఎస్ఓ గుర్తింపు ఉందన్నారు. అయితే ఇక్కడ పరిపాలన అందుకు భిన్నంగా ఉందని, సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. త్వరలోనే చిలమత్తూరు, గోరంట్ల గ్రామ పంచాయతీకి ఐఎస్ఓ వచ్చే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. గోరంట్లలో సోనియాను సర్పంచ్ సరోజబాయి అభినందించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓలు శివనారాయణరెడ్డి, శివకుమారి, ఎంపీడీఓలు నరేష్‌కృష్ణ, రఘునాథగుప్త, ఈఓఆర్డీలు ఈశ్వరయ్య, సుధాకర్ సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల సీనియార్టీ జాబితా సిద్ధం

అనంతపురం ఎడ్యుకేషన్: జోన్–4 పరిధిలోని మోడల్ స్కూళ్ల టీజీటీలకు పీజీటీలుగా పదోన్నతులు కల్పించేందుకు ఫైనల్ సీనియార్టీ జాబితాను సిద్ధం చేసి డీఈఓ కార్యాలయాల్లో ఉంచినట్లు పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు ఎం.వెంకటకృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితా మేరకు సంబంధిత టీజీటీలు సర్వీస్ రిజిష్టర్, ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడేళ్ల కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్స్ (ఏసీఆర్) తీసుకుని ఈ నెల 12న కడప గాంధీనగర్‌లోని మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో హాజరు కావాలని సూచించారు.

నేడు కదిరిలో జాబ్ మేళా

కదిరి అర్బన్: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.స్మిత, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల వయస్సు కలిగి, పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ పూర్తి చేసివారు అర్హులన్నారు. జాబ్‌మేళాలో 14 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, ఆసక్తి కలిగిన వారు బయోడేటాతో పాటు విద్యార్హత పత్రాలు, ఆధార్‌కార్డు తీసుకుని ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 9390176421 నంబరులో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

పాముకాటుతో విద్యార్థి మృతి


మృతుడు శ్రీకాంత్

తలుపుల: పాము కాటుతో ఓ విద్యార్థి మృతి చెందాడు. వివరాలు.. తలుపుల మండలం గెరికపల్లికి చెందిన వెంకటరమణ, నారాయణమ్మ దంపతుల కుమారుడు ఆర్.శ్రీకాంత్ (18) ఐటీఐలో శిక్షణ పొందుతున్నాడు. సోమవారం రాత్రి పొలం వద్ద ఆవులకు కాపలాగా వెళ్లిన శ్రీకాంత్... మధ్య రాత్రిలో మంచం దిగబోతూ కాలు కిందపెట్టాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న పాము కాటేసింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు స్థానికుల సహకారంతో 108 అంబులెన్స్‌లో కదిరిలోని సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. తమ కళ్ల ఎదుటే కుమారుడు నురుగలు కక్కుతూ మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

కానిస్టేబుల్‌కు ఆర్థిక సాయం


కానిస్టేబుల్ రవి దంపతులకు నగదు అందజేస్తున్న అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: కష్టంలో ఉన్న కానిస్టేబుల్ కుటుంబానికి అనంతపురం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అండగా నిలిచారు. డీటీసీలో పని చేస్తున్న కానిస్టేబుల్ రవికుమార్ కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్నట్లుగా తెలుసుకున్న ఎస్పీ... ఆయన శస్త్రచికిత్సకు అవసరమయ్యే రూ.2.13 లక్షలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సకు అవసరమైన డబ్బు లేక ఇబ్బంది పడుతున్న రవికుమార్ దుస్థితిపై సహచర ఉద్యోగులు స్పందించిన తీరుపై హర్షం వ్యక్తం చేశారు. రాయదుర్గం రూరల్, కళ్యాణదుర్గం రూరల్, డీసీఆర్‌బీ సీఐలు విశ్వనాథ చౌదరి, యుగంధర్, తేజోమూర్తి, శ్రీనివాసులు ఆధ్వర్యంలో రూ.2.13 లక్షలు పోగు చేయడం అభినందనీయమన్నారు. ఇదివరకే జిల్లా పోలీసు ఉన్నతాధికారులు చొరవతో రూ.6 లక్షల ఆర్థిక సాయాన్ని ఆర్డీటీ నిర్వాహకులు అందజేశారని గుర్తు చేశారు. బాధిత కానిస్టేబుల్ దంపతులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయబాస్కర్‌రెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు త్రిలోక్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ చాంపియన్ బిహార్

- అంతిమపోరులో ఢిల్లీపై విజయం
- ముగిసిన జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు
- ఫుట్‌బాల్‌కు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తాం : ఎంపీ కోటగిరి శ్రీధర్




బిహార్ జట్టుకు విజేత ట్రోఫీని అందజేస్తున్న ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్, రన్నరప్ ట్రోఫీని అందుకుంటున్న ఢిల్లీ జట్టు

అనంతపురం: జాతీయ ఫుట్‌బాల్ టోర్నీ చాంపియన్‌షిప్‌ను బిహార్ జట్టు దక్కించుకుంది. అనంత క్రీడాగ్రామం వేదికగా 15 రోజులుగా ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో (ఏఐఎఫ్‌ఎఫ్) సాగుతున్న సబ్ జూనియర్ బాలుర జాతీయ ఫుట్‌బాల్ పోటీలు మంగళవారం అట్టహాసంగా ముగిశాయి. మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బిహార్, ఢిల్లీ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. మ్యాచ్ ఆద్యంతం ఎంతో ఉత్కంఠగా సాగింది. స్టేడియం మొత్తం ఈలలు, కేకలతో హోరెత్తింది. మిడ్‌ఫీల్డ్ ఆటగాళ్లు, ఫుల్‌బ్యాక్, సెంటర్ బ్యాక్‌లోని ఆటగాళ్లు మెరుపు వేగంతో బంతిని కదిలిస్తూ ప్రత్యర్థి ఆటగాళ్లను ముప్పుతిప్పలు పెడుతూ బంతిని గోల్ పోస్టుకు చేరుస్తుంటే, గ్యాలరీలో కూర్చొన్న ప్రేక్షకులు ఊపిరి బిగబట్టి చూస్తుండి పోయారు. ప్రత్యర్థి జట్ల స్ట్రైకర్ల ఎత్తుగడలను విఫలం చేస్తూ బంతిని గోల్ కాకుండా ఇరు జట్ల గోల్ కీపర్లు అడ్డుకుంటూ మ్యాచ్‌ను పూర్తి ఉత్కంఠ స్థాయికి తీసుకెళ్లారు. ఆట చివరి నిమిషం వరకూ ఏ జట్టూ గోల్ సాధించలేకపోయింది. మరి కొన్ని సెకన్లలో ఆట ముగుస్తుందనుకుంటున్న తరుణంలో బిహార్ జట్టు క్రీడాకారులు అయూష్ కుమార్ గోల్ చేసి, జట్టును విజయతీరాలకు చేర్చాడు. అంపైర్లు టైమ్ అవుట్ ప్రకటించగానే బిహార్ ఆటగాళ్ల కేరింతలతో స్టేడియం హోరెత్తింది. నాలుగు పర్యాయాలు గోల్ పోస్టుకు అత్యంత చేరువగా వెళ్లినా ఒక్క గోల్ కూడా చేయలేకపోయిన అసహాయ స్థితిలో ఉన్న ఢిల్లీ జట్టు క్రీడాకారులు మ్యాచ్ చేజారిన వెంటనే మైదానంలోనే కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, టోర్నీ ఆరంభం నుంచి బిహార్ జట్టు క్రీడాకారులు దూకుడుగానే ఆడుతూ ప్రతి మ్యాచ్‌లోనూ విజయం సాధిస్తూ వచ్చారు.

ఫలించిన కోటగిరి శ్రీధర్ కృషి

ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ బాధ్యతలు స్వీకరించిన మూడు నెలలకే ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ టోర్నీ నిర్వహణకు కృషి చేశారు. అనంతపురం వేదికగా అతి పెద్ద ఈవెంట్ నిర్వహణకు అవకాశం ఇవ్వడంతో పాటు 15 రోజుల పాటు క్రీడాకారులు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవడంపై ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఎంపీ శ్రీధర్‌కు అభినందనలు తెలిపారు. గత నెల 26న టోర్నీ ప్రారంభమైన ఈ టోర్నీలో 20 రాష్ట్రాలకు చెందిన జట్లు ప్రాతినిధ్యం వహించాయి. ఆర్డీటీ సహకారంతో పాటు ఎంపీ కోటగిరి శ్రీధర్ రూ.30 లక్షలు వెచ్చించి టోర్నీని విజయవంతంగా నిర్వహించారు. విజేత జట్లను అభినందిస్తూ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో ఫుట్‌బాల్‌కు అత్యంత ప్రాధాన్యతనిస్తూ యువతను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తామన్నారు. టోర్నీని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. అనంతరం విజేత క్రీడాకారులను ఘనంగా సన్మానించి, ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ డిప్యూటీ సెక్రటరీ కె.సత్యనారాయణ, ఆర్డీటీ ఉమన్ ఎంపవర్‌మెంట్ సెల్ డైరెక్టర్ విశాల ఫెర్రర్, స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


ఉత్కంఠ పోరులో గోల్‌ను అడ్డుకుంటున్న ఢిల్లీ గోల్‌కీపర్


విజయోత్సాహంతో కేరింతలు కొడుతున్న బిహార్ క్రీడాకారులు

పిల్లలతో కలసి తల్లి ఆత్మహత్యాయత్నం

- సకాలంలో కాపాడిన రైల్వే పోలీసులు


బాధితురాలిని కుటుంబసభ్యులు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు


ధర్మవరం అర్బన్: కుటుంబ సమస్యలతో విసిగిపోయిన ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలను తీసుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోబోయింది. సకాలంలో స్పందించిన రైల్వే పోలీసులు వారిని కాపాడారు. వివరాలు... అనంతపురంలోని నందమూరి నగర్‌కు చెందిన షర్మిలాభాను మంగళవారం ఉదయం తన ఇద్దరు పిల్లలను తీసుకుని ధర్మవరం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ప్లాట్‌ఫాంపై అటు ఇటూ తచ్చాడుతున్న ఆమెపై జీఆర్పీ సిబ్బంది నిఘా వేశారు. కాసేపటి తర్వాత రైలు వస్తున్నట్లుగా అధికారులు అనౌన్స్ చేసిన తర్వాత పిల్లలను తీసుకుని ఆమె ప్లాట్‌ఫాం వెంబడే రైలు పట్టాలపై ముందుకు సాగింది. వెంటనే అప్రమత్తమైన రైల్వే పోలీసులు ఆగమేఘాలపై ఆమెను చేరుకుని పట్టాలపై నుంచి పక్కకు లాగి ప్రాణాలు కాపాడారు. అనంతరం స్టేషన్‌కు తీసుకెళ్లి కుటుంబసభ్యులను పిలిపించారు. తన భర్త, అత్తతో ఉన్న గొడవల వల్ల విసిగిపోయి తాను ఆత్మహత్య చేసుకోవాలని వచ్చినట్లు పోలీసుల ఎదుట బాధితురాలు వాపోయింది. దీంతో కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలంటూ షర్మిలాభాను తల్లిదండ్రులకు సూచించి, పిల్లలతో సహా ఆమెను అప్పగించారు.

పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

పెద్దవడుగూరు: విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని పెద్దవడుగూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుళ్లాయిస్వామి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గత నెల 8న ఎంపీ తలారి రంగయ్య ఆకస్మిక తనిఖీలు చేపట్టిన సమయంలో మేడిమాకులపల్లి గ్రామ సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న గ్రేడ్-3 కార్యదర్శి శివయ్య, గ్రేడ్ -5 కార్యదర్శి భ్రమరాంబ విధులకు హాజరు కాలేదన్నారు. అయితే విధులకు హాజరైనట్లుగా రిజిస్టర్‌లో సంతకాలు మాత్రం చేశారన్నారు. గుర్తించిన ఎంపీ రంగయ్య... ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారన్నారు. విచారణ అనంతరం వీరి పనితీరు సక్రమంగా లేదంటూ పలువురు ఫిర్యాదులు అందజేశారని, ఈ నివేదిక ఆధారంగా ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు.

బత్తాయిలో నల్లి నివారణ చర్యలు చేపట్టండి

- ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్


నల్లి తెగులు ఆశించడంతో లేత బత్తాయి ఆకులపై వచ్చిన తెల్ల మచ్చలు

పుట్టపర్తి అర్బన్: బత్తాయి తోటలను ఆశించిన నల్లి పురుగుతో తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ సూచించారు. ఎర్రనల్లి, మంగునల్లి, పచ్చ నల్లి తదితర పురుగు ఉధృతి కారణంగా పండ్ల నాణ్యత దెబ్బతింటుందన్నారు. మొదటి దశలో పాత ఆకులపై ప్రభావం చూపుతాయన్నారు. నల్లి ఆశించిన ఆకులపై తెల్ల గోలీ ఆకారంలో గుడ్లను పైభాగంలో పెడతాయని వివరించారు. 3 డిగ్రీల సెంటీగ్రేడు వద్ద ఒక తరం 6 రోజుల్లో ముగియనుండగా ఆడ నల్లి 4-6 వారాల దాకా జీవించి 30 గుడ్లను పెడుతుందన్నారు. గాలి వీచి నప్పుడు చెట్టు నుంచి మరో చెట్టుకు వ్యాప్తి చెందుతాయన్నారు. ఈ పురుగు వ్యాపించకుండా వేసవి చివరి వరకూ వీటిని గమనిస్తూ ఉండాలన్నారు. వీటి నివారణకు ఒక లీటరు నీటికి 2 ఎంఎల్ ప్రోపర్‌గైట్ కలిపి పిచికారీ చేయాలన్నారు. లేదా లీటరు నీటికి ఫెస్ ఫెంజాక్విస్/ ఇథియాస్/ డైకోఫోల్ 2ఎంఎల్‌ను కలిపి పిచికారీ చేయాలన్నారు. ఇది కూడా అందుబాటులో లేకపోతే లీటరు నీటికి ఫెస్ఫైరోక్సిమేట్/హెక్సిథియోజాక్స్, స్పైరోమెసిఫెస్ మందు 1 ఎంఎల్‌ను కలిపి పిచికారీ చేస్తే మంచి ప్రయోజనం ఉంటుందన్నారు. ఇంకా మంచి ఫలితాలు రావాలంటే ఈ మందులతో పాటు 3 గ్రాముల వేపనూనె, సబ్బు లేదా కానుగ నూనె, సబ్బు ఉపయోగించాలని సూచించారు.

కౌశల్ సైన్స్ టాలెంట్ టెస్ట్

- ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు మాత్రమే అవకాశం
- 8, 9, 10 తరగతులకు క్విజ్, పోస్టర్ కాంపిటీషన్ పోటీలు


పోస్టర్లను విడుదల చేస్తున్న డీఈఓ నాగరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు విజ్ఞానశాస్త్రంపై 'కౌశల్ సైన్స్ టాలెంట్ టెస్ట్' నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా పాఠశాల, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి క్విజ్, పోస్టర్ పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు ప్రశంసపత్రాలు, నగదు పురస్కారాలు అందజేయనున్నారు. రాష్ట్రస్థాయి విజేతలకు గవర్నర్ చేతుల మీదుగా అభినందించనున్నారు. ఈ పోటీలకు నవంబరు 5లోగా దరఖాస్తు చేసుకోవాలి. ప్రాథమిక స్థాయి నవంబరు 21, 22, 23 తేదీల్లో, జిల్లాస్థాయి పోటీలు డిసెంబరు 8న, రాష్ట్రస్థాయి పోటీలు డిసెంబరు 29, 30 తేదీల్లో జరగనున్నాయి.

సైన్స్ క్విజ్ పోటీలు ఇలా...

8, 9, 10 తరగతుల విద్యార్థులకు గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రం సబ్జెక్టులతో పాటు 'విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయుల కృషి' అనే అంశంపై పోటీలు ఉంటాయి. ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలుంటాయి. క్విజ్ టీంల ఎంపిక కోసం ఆన్‌లైన్‌లో ప్రాథమిక స్థాయి పరీక్ష ఉంటుంది. ఒక పాఠశాలలో మూడు తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు వచ్చిన మార్కులను కలిపి పాఠశాల మార్కు నిర్ణయిస్తారు. జిల్లాలో మొదటి 36 స్థానాల్లో నిలిచిన పాఠశాలలను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. జిల్లాస్థాయి క్విజ్ పోటీలు ఆఫ్‌లైన్‌లో జరుగుతాయి.

పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు ఇలా...

జనరల్ థీమ్...'జీవ వైవిధ్యం', 'వాతావరణ మార్పు-పర్యావరణ', 'నీటి పొదుపు', 'విజ్ఞానశాస్త్ర రంగంలో భారతీయ కృషి' అనే అంశాలపై ఒక పాఠశాల నుంచి 8, 9 తరగతుల విద్యార్థుల నుంచి ఇద్దరు (రెండు ప్రెజెంటేషన్‌లు) పోస్టర్‌ను అప్‌లోడ్ చేయడానికి అనుమతిస్తారు. జిల్లాస్థాయికి 36 పోస్టర్లను ఎంపిక చేస్తారు. జిల్లాస్థాయిలో తొలి మూడుస్థానాల్లో నిలిచిన పోస్టర్లను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు.

విద్యార్థులు విరివిగా పాల్గొనాలి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కౌశల్-2023 పోటీల్లో విరివిగా పాల్గొనాలని డీఈఓ వి.నాగరాజు కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. వివరాలకు www.bvmap.orf సైట్‌ను సందర్శించవచ్చని లేదా జిల్లా కో ఆర్డినేటర్ రాము 86390 94539ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ, అప్కాస్ట్ కోఆర్డినేటర్ ఆనంద భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆర్మీ జవాన్ మృతి


గోపాల్ (ఫైల్)

ఉరవకొండ: స్థానిక పాతపేటకు చెందిన ఆర్మీ జవాన్ రెడ్డిమాసి గోపాల్(41) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. హర్యానాలోని అంబాలలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విధుల నిర్వహణలో నిమగ్నమై ఉన్నప్పుడు ఒక్కసారిగా ఆరోగ్యం క్షీణించడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందారు. గోపాల్‌కు భార్య అనితమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సమాచారం లేకుండా ఆందోళనలు చేస్తే చర్యలు


మాట్లాడుతున్న డీఎస్పీ నరసింగప్ప

గుంతకల్లు రూరల్: ఐఓసీ డ్రైవర్లు, క్లీనర్లు ముందస్తు సమాచారం లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు వంటివి చేపడితే చర్యలు తప్పవని డీఎస్పీ నరసింగప్ప హెచ్చరించారు. పార్కింగ్ విషయమై గుంతకల్లు మండలం నక్కనదొడ్డి వద్దనున్న ఐఓసీ ముందున్న హోటల్ నిర్వాహకుడితో ఈనెల 5న ఆయిల్ ట్యాంకర్స్ డ్రైవర్స్, క్లీనర్స్ ఘర్షణకు దిగారు. మరుసటి రోజు డ్రైవర్లు, క్లీనర్లు అందరూ కలిసి దాదాపు మూడున్నర గంటల పాటు ఐఓసీ ముందు ధర్నా నిర్వహించారు. దీంతో ఐఓసీ కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈవిషయాన్ని తీవ్రంగా పరిగణించిన ఐఓసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఐఓసీ చీఫ్ డిపో మేనేజర్ నవీన్‌కుమార్ మరికొంతమందితో కలిసి డీఎస్పీ డీజిల్ ట్యాంకర్స్ ఓనర్స్, అసోషియేషన్, డ్రైవర్స్ క్లీనర్స్ అసోసియేషన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. రూరల్ సీఐ మహేశ్వరరెడ్డి, ఎస్సై సురేష్, ఐఓసీ సీనియర్ మేనేజర్ డీఏఎస్ ప్రసాద్, హరికృష్ణ చరణ్, ఐఓసీ లైసెనర్ జీఏ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

పేలుడు పదార్థాలపై జాగ్రత్తలు పాటించాలి

యాడికి: సిమెంట్ కర్మాగారాల్లోని మందుగుండు సామగ్రి నిల్వ ఉంచిన గదుల వద్ద జాగ్రత్తలు పాటించాలని తాడిపత్రి డీఎస్పీ గంగయ్య కర్మాగారం యజమానులకు సూచించారు. మంగళవారం గుడిపాడులోని సాగర్ సిమెంట్ కర్మాగారం, బోయరెడ్డి పల్లె వద్ద ఉన్న పెన్నా సిమెంట్ కర్మాగారంలో మందుగుండు నిల్వ ఉంచిన గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గదుల వద్ద భద్రతా ప్రమాణాలను పాటించాలన్నారు. అనంతరం యాడికి సర్కిల్ కార్యాలయం వద్ద తాడిపత్రి సబ్ డివిజన్‌లోని పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. మిస్సింగ్ కేసులపై టీములను ఏర్పాటు చేసి ఛేదించాలన్నారు. రాత్రి పూట గస్తీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐలు గురుప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జిల్లా హ్యాండ్ బాల్ జట్ల ఎంపిక

కళ్యాణదుర్గం: ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకూ వైఎస్సార్ జిల్లా కడపలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ప్రాతినిథ్యం వహించే జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియ మంగళవారం కళ్యాణదుర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించారు. దాదాపు 120 మంది క్రీడాకారులు హాజరు కాగా, వీరిలో ప్రతిభ చూపిన వారిని జిల్లాకు ఎంపిక చేశారు. బాలుర జట్టులో జి.హర్షవర్ధన్, ఎస్.సాదిక్, ఈ.రాజు, బి.వినోద్‌నాయక్, బి.వంశీకుమార్, ఆర్.ధనుష్, కె.దశ్వంత్, ఎం.హరినాథ్ బాబు, బి.సాయికిరణ్, వి.కార్తీక్, ఎం.బన్ని, వి.రవిచంద్ర, డి.సాయి జగన్‌మోహన్, ఎం.జశ్వంత్ రెడ్డి, ఎం.సింహాద్రి, వై.సూర్యతేజ, డి.జశ్వంత్‌నాయక్, డి.ఈశ్వర్, బి.రాజశేఖర్, ఎస్.నవీన్, టి.నాగ మహేష్ చోటు దక్కించుకున్నారు. బాలికల జట్టుకు డి.భవ్యశ్రీ, పి.కరిష్మా సుల్తానా, టి.శారద, బి.గీతాంజలి, జి. నాగరత్న, ఎం.సంధ్య, సి.మిత్ర, ఎస్.సానియా, జె.మీనాక్షి, జి.వరలక్ష్మి, టి.సుష్మిత, జి.గంగమ్మ, వి.నాగేశ్వరి, సి.స్వాతి, పి.నిత్య బ్రాహ్మణి, ఈ.బసమ్మ, ఎం.గాయత్రి, జె.సాయి చైతన్య, బి.నాగలక్ష్మి, బి.లావణ్య చోటు దక్కించుకున్నారు. ఎంపిక ప్రక్రియను జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి శివశంకర్, పాఠశాల హెచ్‌ఎం గంధం శ్రీనివాసులు, సభ్యులు సిద్ధార్థ బాబు, పీడీలు, పీఈటీలు పర్యవేక్షించారు.

మానసిక ఒత్తిళ్లు లేని సమాజాన్ని నిర్మించాలి

- సీనియర్ సివిల్ జడ్జి దీన



ర్యాలీని ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి దీన

అనంతపురం మెడికల్: మానసిక ఒత్తిళ్లు లేని సమాజాన్ని నిర్మించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి దీన పిలుపునిచ్చారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి దీన మాట్లాడుతూ.. వివక్షకు తావు లేకుండా, కులమతాలకు అతీతంగా జీవించినప్పుడే అందమైన మానసిక ఆరోగ్యంతో కూడిన సమాజాన్ని నిర్మించగలమన్నారు. అందరినీ ప్రేమగా పలకరించడం, చేతనైన సాయం చేయడం, బాధల్లో ఉన్న వ్యక్తిని ఓదార్చి వారి స్థితిగతులను మార్చేందుకు తమ వంతు సాయం చేయడం ద్వారా మానసిక ఒత్తిడి దరి చేరకుండా చేయవచ్చునన్నారు. యోగా, ప్రాణాయామం, శారీరక శ్రమ, మంచి ఆలోచనలు కలిగి ఉన్నప్పుడే ఇవి సాధ్యమవుతాయన్నారు. అనంతరం జీజీహెచ్ వరకూ సాగిన ర్యాలీని ఐఎంఏ హాల్ వద్ద ఆమె ప్రారంభించారు. జీజీహెచ్ వద్ద నర్సింగ్ విద్యార్థులు మానవ హారం ఏర్పాటు చేసి మానసిక ఆరోగ్యంపై ప్రజలను చైతన్య పరుస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ శాశ్వత చైర్మన్ కె.శ్రీనివాసరావు, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ అనంతపురం శాఖ అధ్యక్షుడు డాక్టర్ యండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్య విభాగాధిపతి డాక్టర్ వైద్యనాథ్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మనోరంజన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం సిటీ: స్థానిక మారుతీనగర్‌కు చెందిన కేవీ కరుణాకర్(35) మృతదేహాన్ని రాంనగర్ బ్రిడ్జి సమీపంలోని రైలు పట్టాలపై మంగళవారం ఉదయం గుర్తించినట్లు జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. ఆత్మకూరు మండలం సిద్ధరాంపురం గ్రామానికి చెందిన శిల్పను ఆయన పెళ్లి చేసుకున్నారు. ఓ పాప కూడా ఉంది. ఏడాది క్రితం కుటుంబంలో తలెత్తిన మనస్పర్థల కారణంగా దంపతుల మధ్య తరచూ గొడవలు చోటు చేసుకునేవి. ఈ క్రమంలో విసుగు చెందిన శిల్ప ఆర్నెళ్ల క్రితం కుమార్తెను తీసుకుని పుట్టింటికి చేరుకుంది. నగర శివార్లలోని ఓ కార్పొరేట్ ఎంటీడీగా పని చేసే కరుణాకర్.. ఐదు రోజుల కిందటే ఉద్యోగానికి కూడా రాజీనామా చేశారు. ఈ క్రమంలోనే ఒంటరి జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

నేడు కళ్యాణదుర్గంలో 'జగనన్నకు చెబుదాం'

అనంతపురం అర్బన్: జగనన్నకు చెబుదాం - 'స్పందన' ప్రజా సమస్యల పరిష్కార వేదిక మండలస్థాయి కార్యక్రమం బుధవారం కళ్యాణదుర్గంలో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. స్థానిక దొడఘట్ట రోడ్డులోని ఆర్డీటీ ఎకాలజీ సెంటరులో ఉదయం పది గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మత్స్య సహకార సంఘం అధ్యక్ష ఎన్నికకు షెడ్యూల్ విడుదల

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా మత్స్య సహకార సంఘం పాలకవర్గ సభ్యుల ఎన్నికలు నవంబర్ 22న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్‌ను మత్స్యశాఖ డీడీ కె. శాంతి మంగళవారం విడుదల చేశారు. ఈ నెల 16న ఓటుకు అర్హులైన వారి వివరాల ప్రకటన ఉంటుంది. 21న ఓటరు లిస్టు విడుదల చేస్తారు. 31న ఓటరు లిస్టు పరిశీలన, నవంబర్ 6న ఓటరు లిస్టు ముసాయిదా జాబితా విడుదల, 10న అభ్యంతరాల స్వీకరణ, 14న తుది ఓటరు జాబిత ప్రకటన ఉంటుంది. 22న ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ నామినేషన్ల స్వీకరణ, 11 నుంచి 12 గంటల వరకూ పరిశీలన, 12 నుంచి 1 గంట లోపు నామినేషన్ల ఉపసంహరణ, 2 గంటలకు ఎన్నికలు (చేతులు ఎత్తి మద్దతు తెలిపే పద్ధతి) నిర్వహిస్తారు.

వృత్తి నైపుణ్యంతోనే రాణింపు


బహుమతి అందజేస్తున్న కమాండెంట్ గంగాధరరావు

బుక్కరాయసముద్రం: వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకున్నప్పుడే విధుల సమర్థవంతంగా నిర్వహించగలుగుతారని పోలీసులకు ఏపీఎస్పీ 14వ బెటాలియన్ కమాండెంట్ గంగాధరరావు సూచించారు. బీకేఎస్ మండలం జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో పోలీసు సిబ్బందికి ఏఆర్‌సీ శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమాండెంట్ గంగాధరరావు మాట్లాడుతూ... పోలీసుగా ఉద్యోగంలో చేరిన వెంటనే వివిధ అంశాలపై నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. రోజూ క్రమం తప్పని వ్యాయామం, యోగా చేయాలన్నారు. అనంతరం వృత్తి పరమైన అంశాలపై అనుమానాలు నివృత్తి చేశారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ రమణమూర్తి, డీఎస్పీ రమణమూర్తి, ఆర్ఐలు రాము, నాగేంద్ర, లోకేశ్వర నాయుడు, రామారావు, ట్రైనీ ఎస్ఐలు పాల్గొన్నారు.